# హలో బ్రదర్!

నేను ఈ మధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరాను. ఒక్కడినీ గది తీసుకుని హోటల్లో భోంచేస్తూ ఉంటున్నాను. నేను కొంచెం భోజన ప్రియుణ్ణి. నాలుగు రకాల కూరలు, పచ్చళ్ళు ఉంటే తప్ప నాకు సంతృప్తిగా ఉండదు. హోటలు భోజనంతో జిహ్వా చచ్చిపోయిన నాకు హాయిగా నాలుగు రోజులు సంతృప్తిగా సిస్టర్ ఇంట్లో తిందామనిపించింది. మా సిస్టర్ వంట అద్భుతంగా చేస్తుంది. మరో విషయం ఏమిటంటే, వాళ్ళు ఈ మధ్యే ఇల్లు కట్టుకున్నారు. గృహప్రవేశానికి వెళ్ళడానికి నాకు వీలు పడలేదు. వాళ్ళ కొత్త ఇల్లు చూడాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను.

ఈ రెండు కారణాలవల్ల నేను ఉత్సాహంగా బయలుదేరబోయాను, కానీ బావగారు గుర్తుకొచ్చి కొంచెం సందేహించాను. ఆయనకు ముక్కుమీద కోపం. రిజర్వ్డుగా ఉంటారు. ఆయనకు పూర్తి వ్యతిరేకం నేను. బావగారి ఊళ్ళో ఆయన్ను తెలియని వాళ్ళు ఉండొచ్చు కానీ, అప్పుడప్పుడు వచ్చి పోతుండే నన్ను తెలియని వాళ్ళు కానీ, నాకు తెలియని వాళ్ళుకానీ ఎవరూ లేరని చెప్పొచ్చు. మన పెర్సనాలిటీ, ఛార్మ్ అలాంటివి. మా బావగారికి మాత్రం ఎందుకనో నేను మెంటల్ కేసులా కనిపిస్తాను. ఆయన చికాకు, కోపం గుర్తుకొచ్చి కొంచెం సందేహించినా, సిస్టర్ వంట ప్రావీణ్యం గుర్తుకొచ్చి హుషారుగా రైలెక్కాను.

మా సిస్టర్ వాళ్ళ ఊరు చిన్న పల్లెటూరు. ఉదయం పదకొండు గంటలకు చేరాల్సిన ప్యాసింజరు, రైల్వేవారి కాలమానం ప్రకారం మూడువందల అరవైతొమ్మిది నిమిషాలు మాత్రమే ఆలస్యంగా – సాయంకాలం అయిదుగంటల తొమ్మిది నిమిషాలకు చేరింది. స్టేషనులో నేను ఒక్కణ్ణే దిగాను. మరెవరూ బండి ఎక్కలేదు, దిగలేదు. బ్యాగ్ తీసుకుని స్టేషను బయటికి వచ్చాను.

ప్రయాణీకుల కోసం ఎదురుచూస్తూ నిద్రగన్నేరు చెట్టుకింద ఒకటి, రెండు రిక్షాలుండేవి. కానీ, ఆ రోజు ఒక్కటీ కనిపించలేదు. రిక్షాలేమైపోయాయి అనుకుంటుంటే, 'హాంటే కేబ్' అని ఇంగ్లీషులో వినిపించి వెనక్కు తిరిగాను - గళ్ళ షర్టు, గళ్ళ పాంటు, నెత్తిమీద హేటూ - కేబ్ డ్రైవరు కనిపించాడు.

'కేబ్?' అన్నాను నేను అయోమయంగా.

'టేక్సీ.... టేక్సీ....' అన్నాడు అతను కేబ్ అంటే నాకు అర్థం కాలేదనుకుని. ఇతన్నెక్కడో చూసినట్లుగా వుందే అనుకుంటుంటే గుర్తొచ్చింది. 'నువ్వు.... నువ్వు.... రిక్షారాముడివి కదూ!' అన్నాను.

'యా.... యా.... నో.... నో.... కేబ్ రేమ్' అన్నాడు రిక్షారాముడు - 'ఇంకా రిక్షా ఏంటండి? రిక్షా, ఇల్లూ, మాయావిడ గొలుసు - అన్నీ అమ్మేసి, బ్యాంకు లోను తీసుకుని టేక్సీ కొని నడుపుతున్నానండి' అన్నాడు అతను కూడా నన్ను గుర్తుపట్టి, నా బ్యాగ్ అందుకుని టేక్సీలో పడేస్తూ.

రేమ్ టేక్సీ పాతకారు - నల్లరంగుది - మ్యూజియం పీస్ లా ఉంది. టేక్సీ మీద 'ప్రగతి రథం - తిరుమల బ్యాంకువారి సహకారంతో' అని రాసి ఉంది. వెనుక తలుపు తీసి కూర్చుంటూ, 'రేమ్, కొంచెం తొందరగా పోనీ - వెధవ బండి లేటవడం మూలాన పొద్దున్నుంచీ తిండి లేదు' అన్నాను.

'టు మినిట్స్' అన్నాడు రేమ్, టీవీ ఎడ్వర్టయిజ్‌మెంటులోలా.

'మరీ రేష్‌గా వద్దు. రెండు కిలోమీటర్లూ తాపీగా అయిదు నిమిషాల్లో పోనీ'

రేమ్ ముందు తలుపు లాగబోతే జామ్ అయిపోయి తలుపు రాలేదు. అతను వెనుక తలుపు లాగి, 'కొంచెం అటుండండి సార్' అని వెనుక సీటులోంచి డ్రైవర్ సీట్లోకి దూకి, 'ఏడుకొండలవాడా - గోవిందా .... గోవింద....' అని బండి స్టార్టు చేశాడు

పిండిమిల్లు, రంపంమిల్లు, రోడ్డు రోలరూ, రైలింజను - నాలుగూ నాలుగు మైకుల ముందు నిలబడి స్టీరియోఫోనిక్ సంగీతం వినిపించినట్లు నాలుగువైపులనుంచీ వింత శబ్దాలు రాసాగాయి. కారు మలేరియా వచ్చినట్లు గడగడ వణకసాగింది. ముందుకెళ్ళడానికి బదులు కప్పలాగా ఎగిరి దూకడం మొదలుపెట్టింది ప్రగతి రథం.

'రేమ్! మన బండికి కారింజనుందా? రాకెట్టింజనుందా?' అన్నాను నేను గట్టిగా అరుస్తూ.

'మన బండికి స్టార్టింగ్ ట్రబుల్ సార్! ఒకసారి స్టార్టవనివ్వండి. ఎంత మెత్తగా పోతుందో - అసలు బండి కదులుతున్నట్టే తెలీదు' అనరిచాడు రేమ్ ఎగిరెగిరి పడుతూ.

అన్నట్టుగానే శబ్దాలు ఆగిపోయి అంతా నిశ్శబ్దమైంది – 'అసలు బండి నడుస్తున్నట్టే తెలియడం లేదు' అన్నాను నేను ఆశ్చర్యపోయి.

'అసలు బండి నడవడం లేదు. ఇంజనాగిపోయింది. ఓసారి దిగి గెంటండి'

దిగుదామని తలుపు లాగితే ఈసారి వెనుక తలుపు తెరుచుకోలేదు. నేను ముందు సీట్లోకి దూకి, డ్రైవర్ పక్క తలుపులు తెరుచుకుని బయటకు దిగి కారు గెంటాను. చివరికి బండి స్టార్టయింది. మళ్ళా ముందు సీట్లోంచి వెనుక సీట్లోకి దిగి కూర్చున్నాను. బండి వేగం అందుకుంది. గోతుల్లో, గొప్పుల్లో ఎగిరెగిరి పడసాగింది.

'వెధవ ఇండియన్ రోడ్లు – అమెరికాలో రోడ్లు ఇలా ఉండవు సార్' అన్నాడు రేమ్.

అందరూ కువైట్ పోతుంటే మనవాడు రూటు మార్చాడేవిటి అని ఆశ్చర్యపోతూ, 'నువ్వు అమెరికా ఎప్పుడెళ్ళావు?' అనడిగాను.

'అమెరికా సూడాలంటే మనం ఎళ్ళాలటండి? చిటికెనేలు కదిపితే అమెరికాయే మన కాళ్ళ దగ్గరకొస్తాది' అన్నాడు రేమ్ అర్ధనిమీలిత నేత్రాలతో. కారు పెద్ద గొయ్యిలో పడి ఎగిరి లేచింది.

'రేమ్!' నేను కంగారుపడి అరిచాను – 'నీ మనసు అమెరికాలో విహరిస్తున్నా నీ కారు మన వెధవ రోడ్డుమీదే ఉంది – జాగ్రత్త. ఒళ్ళు దగ్గరుంచుకు నడుపు...' అంటుండగా ఒక అమ్మాయి పువ్వుల లుంగీమీద లాల్చీ వేసి, జుట్టు వెనక్కు దువ్వి, రబ్బరు బేండు పెట్టి, చెవులకు పెద్ద పెద్ద రింగులతో దర్శనమిచ్చింది.

'పల్లెటూళ్ళలో కూడా ఫేషనొచ్చేసింది. ఆ అమ్మాయి చూడు! ఎంత మాడ్రన్‌గా ఉందో' అన్నాను రేమ్‌తో.

'ఊరుకోండి – అమ్మాయి కాదు – శాస్త్రిగారి రెండో అబ్బాయి – మీతో గుడి అరుగుమీద పేకాడేవోడు – మర్చిపోయారా?' అన్నాడు కేబ్ రేమ్ మందలిస్తూ.

గుడి అరుగుమీద నాతో పేకాట ఆడిన అబ్బాయి ఇలా అమ్మాయో, అబ్బాయో తెలియనట్లుగా ఎలా మారిపోయాడా అని ఆలోచిస్తుంటే కారాగిపోయింది. రేమ్ సుత్తులూ, స్క్రూడ్రైవర్లూ తీసుకుని బండి కిందకు దూరాడు. నేను కారు దిగి ఒళ్ళు విరుచుకుంటుంటే మరో దృశ్యం నా కంటపడింది.

పిడకల కాంతమ్మ పేడతో ఉండలు చేసి ఊకలో పొర్లించి, మొగుడి మీదకు విసురుతోంది. వాటిని అతను క్రికెట్ బాల్ కేచ్ చేసినట్లు కేచ్‌చేసి, చేతిలో క్షణం ఉంచకుండా వెంటనే గోడమీదకు విసురుతున్నాడు. వాళ్ళపక్కన పదేళ్ళ కుర్రాడు

స్టాప్ వాచీ పట్టుకుని చూస్తూ లెక్కపెడుతున్నాడు – 'నూట ఒకటి.... నూట రెండు.... నూట పన్నెండు....'

'ఎవరది? పిడలక కాంతమ్మా, కాంతమ్మ మొగుడూ కదూ!' అన్నాను నేను వాళ్ళకేసి చూస్తూ.

'ఆళ్ళే' అన్నాడు రేమ్ కారు కిందనుంచి బయటకు వచ్చి చూసి, మళ్ళీ కారు కిందకు దూరిపోతూ.

'ఇదేం ఆట కాంతమ్మా?' అనడిగాను వాళ్ళ గేమ్ పూర్తయ్యాక.

'మాయమ్మ గిన్నెల బుక్కులోకి ఎక్కాలని సూస్తోంది' అన్నాడు కుర్రాడు.

'గిన్నెల బుక్కేవిటి?'

'గిన్నీస్ బుక్ – వీళ్ళు అనెడ్యుకేటెడ్ కదా! అలా అంటారు సార్ – ఇక మనం వెడదామా?' అన్నాడు రేమ్.

'పద – బాగా ఆలస్యమైంది' అంటూ కారెక్కబోతుంటే, 'అదేంటి సార్ – అలా కారెక్కేస్తున్నారు – గెంటకపోతే బండెలా స్టార్టవుతుంది?'

ఈ దిక్కుమాలిన టేక్సీ ఎక్కకుండా ఉంటే గెంటాల్సిన అవస్థ తప్పేది. నడచి వెళ్ళినా, ఆడుతూ పాడుతూ అరగంటలో వెళ్ళిపోయేవాణ్ణి. తిట్టుకుంటూ నీరసంగా కారు గెంటసాగాను. కారు స్టార్టయింది. కానీ ఈసారి ముందు తలుపులు, వెనుక తలుపులు అన్నీ జామ్ అయిపోయి తెరుచుకోలేదు. టేక్సీలో రేమ్, బయట నేనూ ఉండిపోయాం.

'రేమ్! నేనింక నడచి వెడతా. నువ్వు మెల్లిగా నా బేగ్ తీసుకురా'

'మీరెళ్ళిపోతే ఎలా సార్! దీంట్లోంచి నేనెలా బయటపడను?' అన్నాడు రేమ్ కంగారుగా.

'ఎలాగో అలా బయటపడు' – విసుగ్గా అని నడక ప్రారంభించాను.

ఈ ఊరంతా మారినట్లూ కనిపిస్తోంది, మారనట్టూ కనిపిస్తోంది. స్టేషను, రోడ్డు, ఊరు చూస్తే అంతా పాడుపడిపోయినట్లుండి, ఏవీ మారినట్లు కనిపించడం లేదు. మనుషులు చూస్తే యమాగా మారిపోయారు. ఇది తమాషాగా ఉందే అని ఆలోచిస్తూ నడుస్తుంటే – పేద బతుకులకీ, పెద్ద స్వప్నాలకీ లింకు – డిష్ ఏంటెన్నా కనిపించింది.

ఊరికి కేబుల్ విప్లవం వ్యాపించిందన్నమాట – అనుకుంటూ మరో నాలుగడుగు లేసేటప్పటికి కూరల నారయ్య రోడ్డు మధ్య డాన్సు చేస్తూ కనిపించాడు.

బాలే డాన్సులోలా పరిగేసుకొచ్చి ఎగిరి గంతేసి, ఆరడుగులు ఆకాశంలోకి లేచి కాళ్ళు రెండూ చాచి నేలమీద దిగుతున్నాడు. అలా దిగుతూనే నేలమీద పడి దొర్లి నిటారుగా గడకర్రలా లేస్తున్నాడు. అంతలో అష్టవంకర్లు తిరిగి, వీపు, భుజాలు, కాళ్ళు గోక్కుంటున్నాడు. క్షణంలో భంగిమ మార్చి మళ్ళీ పైకెగురుతున్నాడు.

'ఆహా! ఏం స్టెప్స్ నారయ్యా! ప్రభుదేవా నీ ముందు దిగదుడుపు' అన్నాను అభినందిస్తూ – ఇది కూడా కేబుల్ విప్లవం ప్రభావం అనుకుంటూ.

'స్టెప్సేంటి బాబూ' అంది వాళ్ళమ్మ పేడ తట్ట దించుతూ – 'వంగతోటలోంచి వస్తూ కాలు జారి దూలగుండ మొక్కల్లో పడ్డాడు. సచ్చే దురద – బిడ్డ బాధ సూడలేకుండా ఉన్నాను' అంటూ ఇంత పేడ తీసి వాడి వీపుకి రాసింది.

నారయ్య, 'ఛ.... ఇదేంటే....' అంటూ మైఖేల్ జాక్సన్ భంగిమ ఇస్తూ ఎగిరి గంతేశాడు.

'దూలగుండకి మందు – దురదలు తగ్గొద్దూ' అంది నారయ్య తల్లి ఇంకొంచెం పేడ రాస్తూ...

నేను సిస్టరు ఇల్లు చేరేటప్పటికి రేమ్ టేక్సీ కూడా వచ్చింది. రేమ్ కిటికీ అద్దం దించి నా బ్యాగ్ అందించి, 'ఈ బండిలోంచి ఎలా బయటపడను సార్' అన్నాడు దీనంగా.

'తిన్నగా కమ్మరాడి దగ్గరకు పో! కారు బద్దలు కొట్టి బయటికి తీస్తాడు' అని సలహా ఇచ్చాను.

'థ్యాంక్స్ సార్' అన్నాడు రేమ్, ఆ ఐడియా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.

అప్పటికి ఆరున్నరయింది. కొద్దిగా చీకటి పడుతోంది, కానీ ఇంకా వెలుగుంది. యుద్ధ విమానం బాంబులు వేస్తూ వెళ్ళినట్లు రేమ్ టేక్సీ వచ్చి వెళ్ళింది. కానీ ఎవరు వచ్చారో చూడ్డానికి ఇంట్లోంచి ఎవరూ బయటికి రాలేదు. ఇంట్లో ఎవరూ లేరా అంటే హాలు తలుపులు తెరిచే ఉన్నాయి. 'ఏమైందబ్బా' అనుకుంటూ నేను హాల్లోకి అడుగు పెట్టాను.

హాల్లో సిస్టర్‌తో సహా ఓ పది, పన్నెండుమంది రకరకాల భంగిమలలో పడుకుని, కూర్చుని కన్నార్పకుండా టీవీకేసే చూస్తున్నారు. నేను వచ్చానన్న స్పృహలేదు. అంతగా లీనమైపోయారు సినిమాలో....

'వాడు కేడీ – హంతకుడు – తెలుసా?' – హీరోయిన్ తండ్రి గద్దిస్తున్నాడు.

'తెలుసు' - హీరోయిన్ చిరునవ్వు నవ్వింది - 'మీరు అతను చేసిన హత్యలు, దోపిడీలు చూస్తున్నారు కానీ, నేను అతనిలో మరొకటి చూస్తున్నాను'.

'ఏవిటది?' - హీరోయిన్ తండ్రి ఇంకో రంకేశాడు.

'ప్రేమించే హృదయం' - వీణ మీటినట్లుగా అంది హీరోయిన్ ఆరాధనగా, అరమోడ్పు కన్నులతో....

'సిస్టర్' అన్నాను సిస్టర్ దగ్గరకొచ్చి.

'ఎప్పుడొచ్చావు?' అంది సిస్టర్ పావుక్షణం నాకేసి తిరిగి.

'ఇప్పుడే.... పొద్దుట రావాల్సిన బండి....'

'ఉష్ - లోపలికెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కురా! ఇప్పుడే వస్తాను' అంది సిస్టర్ తలైనా తిప్పకుండా.

'కనీసం మంచినీళ్ళైనా ఇవ్వలేదు. ఇదెక్కడి టీవీరా' అనుకుంటూ బ్యాగ్ భుజానికి తగిలించుకుని లోపలకు వెళ్ళి గ్లాసు కోసం వెతుకుతుంటే, లోపలి గదిలోంచి నాలాగే భుజాన సంచీ తగిలించుకుని వస్తూ ఒకతను కనిపించాడు. అతనిదీ నా వయసే. నాలాగే ఇతను కూడా చుట్టమేమో - మంచినీళ్ళకోసం వచ్చి ఉంటాడనుకుని, 'హలో... హలో.... నువ్వూ నాలాగేనా?' అని పలకరించాను, అతని దారికి అడ్డంపడి.

నేను హఠాత్తుగా అలా పలకరించగానే ఉలిక్కిపడ్డాడు అతను. 'హలో... హలో... నువ్వూ నాలాగేనా?' అన్నాడు అతను కొంచెం కంగారుగా.

'యస్' అన్నాను నేను. నా సమాధానం వినిపించగానే అతను నిట్టూర్చాడు.

'ఏ ఊరు మనది?' అనడిగాను.

'రాజమండ్రి.... మనదే ఊరు?'

'విశాఖపట్టణం - వీళ్ళు చుట్టాలా?'

'ఇంటాయన మా బావ - వరసకి మేనత్త కొడుకు - దూరపు బంధుత్వం - నువ్వు?'

'ఇంటావిడ మా సిస్టర్ - వరసకి పెత్తల్లి కూతురు - మాదీ దూరపు బంధుత్వమే'.

'హలో! అయితే, మనిద్దరం బ్రదర్సు అవుతావన్నమాట - హలో బ్రదర్!' అన్నాడు అతను చేయి ముందుకు చాచి.

'హలో బ్రదర్!' అన్నాను నేను బ్రదర్ చెయ్యి ఆప్యాయంగా అందుకుంటూ - 'కొత్త ఇల్లు కదా - ఒకసారి చూసిపోదామనిపించింది'.

'నాకూ అలాగే అనిపించింది'.

'గృహప్రవేశానికి రావడం వీలుపడలేదు'.

'నాకూ వీలుపడలేదు'.

ఇంతలో వచ్చిన పని గుర్తుకువచ్చింది – 'బ్రదర్, గ్లాసులెక్కడున్నాయో తెల్సా?'

'స్పెషలైజేషన్ గ్లాసులా?'

'స్పెషలైజేషన్ ఏవిటి?'

'డాక్టర్లు చూడు – కన్ను, ముక్కు, గొంతు, గుండె స్పెషలిస్టులుంటారే – అలా!'

'అలాగా? నాది జనరల్ ప్రాక్టీసు' అన్నాను నవ్వుతూ. బ్రదర్ జోకేస్తే మనం కూడా వెయ్యాలి కదా!

'నాదీ జనరల్ ప్రాక్టీసే' – సంచీలోంచి స్టెయిన్ లెస్ స్టీలు గ్లాసు తీసి ఇస్తూ అన్నాడు బ్రదర్ – 'నీళ్ళు తాగి గ్లాసు ఇచ్చెయి'.

'వీళ్ళ టీవీ తగలడా – ఇది వరకు అయితే వెండి గ్లాసుతో కాఫీ ఇచ్చి, వెండి పళ్ళెంలో భోజనం పెట్టేవారు. ఇప్పుడు నీళ్ళు కూడా మనవే తెచ్చుకోవాల్సి వస్తోంది...'

'ఇనప్పెట్టె ఎక్కడ బ్రదర్?' అనడిగాడు బ్రదర్ ఉత్సాహంగా.

'వీళ్ళు ఇనప్పెట్టె కొన్నారా? నాకు తెలీదే – ఇదివరకైతే వెండి కంచాలు, వెండి గ్లాసులు అటకమీద సందుగ పెట్లో దాచేవారు...'

'అటక ఎక్కడ బ్రదర్?'

'ఎటాచ్డ్ బాత్రూం పైన కట్టించారుట...' – నేను సమాధానం చెబుతుంటే కరెంటుపోయింది. సిస్టర్ కొవ్వొత్తి తీసుకుని లోపలికి వస్తూ, నన్ను చూసి ఆశ్చర్యపోయింది – 'ఇదేవిటి – నువ్వెప్పుడొచ్చావు'.

'నిన్ను ఇందాకా పలకరించాగా – లోపలికెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కురా అన్నావు' అన్నాను నేను తెల్లబోతూ.

'ఇతనెవరు?' అంది బ్రదర్ కేసి చూస్తూ.

'ఇతన్ని కూడా మర్చిపోయావా – బావగారి మేనత్త కొడుకు – రాజమండ్రి నుంచి వచ్చాడు'.

'నమస్కారం అక్కయ్యగారూ' అన్నాడు బ్రదర్ రెండు చేతులూ జోడించి.

'ఇద్దరూ స్నానం చేసి రండి - భోంచేద్దురుగాని' - సిస్టర్ అంటుండగా మళ్ళీ కరెంటు వచ్చింది. సిస్టర్ మమ్మల్నిద్దర్నీ మర్చిపోయి సగంలో ఆగిపోయిన సినిమా చూడడానికి హాల్లోకి పరిగెట్టింది.

నేను నా బ్యాగ్ లోంచి ప్యాంటూ, షర్టూ తీసి కొక్కేనికి తగిలించి, బట్టలు విప్పి టవలు కట్టుకుని స్నానానికి వెళ్ళబోతుంటే, 'వాచీ తడిసిపోతుంది - ఇలా ఇయ్యి - బట్టలు కూడా, నీ బ్యాగ్‌లో సర్దుతాలే' అన్నాడు బ్రదర్.

నేను వాచీ, విప్పిన బట్టలు అందించి, 'బ్రదర్ -ప్యాంటులో నా పర్సుంది - జాగ్రత్త - మరి నేను స్నానం చేసి రానా?' అన్నాను.

'నిరభ్యంతరంగా' అన్నాడు బ్రదర్, నా పర్సు తన జేబులో భద్రంగా దాస్తూ.

నేను బాత్రూంలోకి వెళ్ళాను. స్నానం చేద్దామని చూస్తే సబ్బు కనిపించలేదు.

'బ్రదర్' అనరిచాను తలుపు తీసి, బ్రదర్ ఎక్కడో దూరంగా ఉన్నాడనుకొని. మూలనున్న స్టూలు దగ్గరికి వెడుతున్న బ్రదర్ ఉలిక్కిపడి వెనక్కు తిరిగాడు - 'సబ్బు లేదు బ్రదర్'.

'సబ్బు కావాలని మెల్లగా అడగొచ్చుగదా! ఆ అరుపేవిటి హడలి చచ్చేలా' అంటూ బ్రదర్ బ్యాగ్ తెరిచాడు. బ్రదర్ బ్యాగ్ నిండా రకరకాల సబ్బులు, తాళం చెవుల గుత్తులు, బూట్లూ, కంచాలు, గ్లాసులు, పలకలు, ఎక్కాల పుస్తకాలు - అన్నీ ఉన్నాయి తమాషాగా.

'బ్రదర్ - నీ బ్యాగ్ సూపర్ బజార్లా ఉంది' అన్నాను ఆశ్చర్యపోతూ.

'నా నిక్ నేమ్ వేక్యూం క్లీనర్ - అడ్డం వచ్చినవన్నీ బ్యాగ్‌లోకి ఊడ్చెయ్యడం నా అలవాటు'.

సబ్బు తీసుకుని బాత్రూంలోకి నడిచాను. అయిదు నిమిషాల తర్వాత స్నానం చేసి బయటికి వస్తుంటే స్టూలు కాలికి తగిలింది. ఎవరబ్బా ఈ స్టూలు దారికి అడ్డు పెట్టారు అనుకుని తీసి ఓ మూల పెడుతుంటే అటక మీంచి దబ్బున పడ్డాడు బ్రదర్, 'చచ్చాను' అంటూ.

'ఏమైంది బ్రదర్?'

'స్టూలుందనుకుని దిగాను. ఇక్కడ స్టూలుండాలి - ఏదీ?'

'స్టూలు కాలికి తగిలితే అటు పెట్టాను బ్రదర్!'

'చంపావు బ్రదర్' అంటూ నడుం ఒక చేత్తో పట్టుకుని మూలుగుతూ లేచాడు బ్రదర్.

'అదేవిటి బ్రదర్ – సుభ్రంగా లైటేసుకోవచ్చు కదా! అలా చీకట్లో తడుములాడు కోకపోతే'.

'గొప్ప గొప్ప పనులన్నీ చీకట్లోనే జరుగుతాయి బ్రదర్'.

'ఇదేదో ద్వంద్వార్థాల సినిమా డైలాగులాగుంది బ్రదర్'.

'సినిమా డైలాగు కాదు – నా సొంత ఏడుపు బ్రదర్' అన్నాడు బ్రదర్ మళ్ళీ మూలుగుతూ.

'ఏవిటి బ్రదర్ – అటకెందుకెక్కావు?'

'దూళ్ళగడ్డికి'.

'దూళ్ళగడ్డికా?'

'లేకపోతే ఏవిటి బ్రదర్ – అడగకూడదు – అర్థం చేసుకోవాలి' అన్నాడు చేతిలో వెండి కంచం, గ్లాసూ చూపిస్తూ.

బ్రదర్ ఆదరాభిమానాలకు నా గుండె కరిగి నీరయింది – 'ఏవిటి బ్రదర్ – దీని కోసం కాళ్ళూ చేతులూ విరగ్గొట్టుకోవాలా? విస్తరాకులో అయినా తినేసేవాణ్ణి కదా' అన్నాను అభిమానంగా.

ఇంతలో మళ్ళీ కరెంటు పోయింది.

సిస్టర్ కొవ్వొత్తి తీసుకుని లోపలికి వచ్చి నన్ను చూసి ఆశ్చర్యపోయింది 'నువ్వెప్పుడొచ్చావు'.

'ఇది రెండోసారి అడగడం' అన్నాను నేను తలపట్టుకుని.

'ఇంతకుముందు నీతో మాట్లాడానా?' అంది సిస్టర్ తెల్లబోయి – 'ఇతనెవరు?'

'నమస్కారం అక్కయ్యగారూ' అన్నాడు బ్రదర్ రెండు చేతులూ జోడించి.

'ఇతను మన బ్రదర్. బావగారి మేనత్త కొడుకు – రాజమండ్రి – ఇంతకు ముందు ఒకసారి పరిచయం చేశాను' అన్నాను నిష్ఠూరంగా.

'పరిచయం చేశావా – మర్చిపోయాను కాబోలు – ఏవనుకోకు తమ్ముడూ' అంది బ్రదర్ కేసి తిరిగి.

'అనుకోడానికేం ఉంది అక్కయ్యగారూ – అబ్బా.....'

'ఏవిటి తమ్ముడూ – అలా కుంటుతున్నావు?'

'బ్రదర్ అటక మీంచి....' అని చెప్పబోతుంటే నా నోరు నొక్కి 'అమృతాంజనం ఉందా అక్కయ్యగారూ' అనడిగాడు బ్రదర్.

'హాల్లో అలమైరాలో ఉంది' – సిస్టర్ అంటుండగా కరెంటు వచ్చింది. సిస్టర్ టీవీ చూడడానికి హాల్లోకి పరిగెట్టింది. సిస్టర్ వెనకే కుంటుకుంటూ హాల్లోకి వెళ్ళాడు బ్రదర్. రెండు నిమిషాల తర్వాత అమృతాంజనం సీసాతో పాటు అలారం టైంపీసు, సిస్టర్ బంగారుగాజు తీసుకొచ్చాడు.

'చూడు బ్రదర్ – సిస్టర్‌కి ఎంత నిర్లక్ష్యమో – విలువైన వస్తువులు అలా హాల్లో అలమైరాలో వదిలేస్తారా?' అన్నాడు సిస్టర్ గాజు చూపిస్తూ.

'రెండో గాజేదీ?'

'రెండో గాజేవిటి?'

'దీనికి జోడు ఇంకోటి ఉండాలే....'

'జోడు గాజులా.....' – బ్రదర్ కళ్ళు మిలమిల మెరిశాయి. వెంటనే హాల్లోకి కుంటుకుంటూ పరిగెట్టాడు. అతని వెనకే నేనూ వెళ్ళాను.

'అక్కయ్యగారూ' అన్నాడు బ్రదర్ సిస్టర్‌తో.

'ఉష్....'

'ఈ గాజు జోడెక్కడుంది?'

'ఉష్... ఎక్కడా పోలేదు – వంటింట్లో కందిపప్పు డబ్బాలో భద్రంగా ఉంది – గొడవ చెయ్యకు....' అంది సిస్టర్ తల తిప్పకుండా.

'ఏం జాగ్రత్త బ్రదర్ సిస్టర్‌కి – బంగారు వస్తువులు కందిపప్పు డబ్బాలోనూ, చింతపండు బుట్టల్లోనూ దాస్తోంది – బంగారు గాజుల పులుసు, జూకాల చారు చేస్తుందా?' అన్నాను కంది పప్పు డబ్బాలోంచి గాజు బయటికి తీస్తూ.

'చింతపండు బుట్టకూడా తియ్యి' అన్నాడు బ్రదర్ ఉత్సాహంగా, గాజు అందుకుంటూ.

'ఎందుకు?'

'జూకాలున్నాయన్నావు కదా!'

'నేను జోకేశాను బ్రదర్ .... హ్హా... హ్హా....'

'ఈసారి జోకేస్తే ముందు చెప్పి వెయ్యి – వేశాకా నువ్వు మాత్రం నవ్వకు' అన్నాడు బ్రదర్ చిరాగ్గా – 'ఇది నేను జాగ్రత్త పెడతాలే కానీ, నువ్వు భోంచెయ్యి'

'నువ్వూ స్నానం చేసిరా – ఇద్దరం కలిసి భోంచేద్దాం'

'నేను భోంచెయ్యను'.

'ఏం?'

'తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టాలంటే అదో సెంటిమెంటు'.

'అంటే అర్థం ఏవిటి బ్రదర్'.

'నువ్వు ముందు భోంచెయ్యి బ్రదర్'.

అంతవరకూ నేను తడి టవలుతో తిరుగుతున్న సంగతి గుర్తుకొచ్చి - 'నా ప్యాంటూ, షర్టూ ...' అన్నాను.

బ్రదర్‌కి ఆచారం ఎక్కువలా ఉంది - 'ముందు భోంచెయ్యి - భోజనవయ్యాకా ప్యాంటూ, షర్టూ ఇస్తాగా....' అన్నాడు.

బ్రదర్ స్వయంగా వడ్డించి కొసరి కొసరి తినిపించి, నేను ఎంత వారిస్తున్నా వినకుండా కంచం, గ్లాసు తనే కడిగాడు. నేను చేతులు కడుక్కోడానికి పెరట్లోకి వెడుతుండగా, తెలుగు సినిమా అయిపోయింది కాబోలు, గొల్లున గోల వినిపించింది. పిల్లలు 'స్టార్... స్టార్....' అని అరుస్తున్నారు. నేను చేతులు కడుక్కుని రెండు నిమిషాల తర్వాత లోపలికి వస్తుంటే సిస్టర్ ఎదురైంది. నన్ను చూసి నోరు తెరిచి ఏదో అడగబోతుంటే ఆపుచేసి, 'బ్రదరేడీ' అనడిగాను.

'బ్రదరెవరు?'

తడి టవలు కట్టుకుని చరిత్ర చెప్పే ఓపిక లేదు నాకు. అర్జెంటుగా బట్టలేసుకోవాలి.

బ్రదర్ కోసం ఇల్లంతా వెతుకుతూ హాల్లోకి వెళ్ళాను. హాలు మధ్యలో బ్రదర్ బండబ్బాయిలా నోరు తెరుచుకుని స్టార్ టీవీలో సినిమా మైమరచిపోయి చూస్తున్నాడు. బట్టలు తీసుకొస్తాడని నేనెదురు చూస్తుంటే మతిమరుపు బ్రదర్ నా ప్యాంటు, షర్టు, బూట్లు- అన్నీ వేసుకుని పండులా తయారైపోయి ప్రయాణానికి బయలుదేరే వాడిలా నా బ్యాగ్, అతని బ్యాగ్ - రెండు బ్యాగ్‌లు తీసుకుని హాల్లోకి వెళ్ళిపోయాడు.

'ఇతనే బ్రదర్' అన్నాను సిస్టర్‌తో.

'ఇప్పుడు గుర్తొస్తోంది - ఇతను ఆ బ్యాగ్‌లు రెండూ తీసుకుని వెడుతూ టీవీ చూసి ఆగిపోయాడు'.

'బాగానే ఉంది - బ్యాగ్‌లు లోపల పెట్టు బ్రదర్ అంటే హాల్లో పెట్టాడు బ్రదర్. అతను హాల్లోకి వచ్చిన సంగతి నీకిప్పుడు గుర్తుకొస్తోంది. అతను బ్రదర్ కాబట్టి సరిపోయింది. అదే ఏ దొంగైనా అయితే? ఇంట్లోంచి కొత్త మనిషి అలా బ్యాగ్‌లు తీసుకుని వెళ్ళిపోతూంటే నీకేవీ అనిపించలేదా?' అన్నాను సిస్టర్‌ని మందలిస్తూ.

'అప్పుడు అనిపించలేదు – నా దృష్టి ఇంకా సినిమా కథమీదే ఉంది'.

'బ్రదర్ – ఆ ప్యాంటు, షర్టు నావి – నువ్వు పొరపాటున వేసుకున్నావు' అన్నాను బ్రదర్‌తో.

'ఉష్ – గొడవచెయ్యకు – ఎంత సస్పెన్సో....' అన్నాడు బ్రదర్ తల తిప్పకుండా, తెరమీద పోలీసులు దొంగని తరుముతుంటే, దొంగ మేడ మీంచి మేడ మీదకు దూకుతూ తప్పించుకు పారిపోతున్నాడు.

'బ్రదర్ – ఈ టవలు కట్టుకుని ఆ ప్యాంటూ, షర్టూ ఇచ్చేయ్ – నువ్వు కూడా స్నానం చేసిరా' అన్నాను భుజం మీది పై టవలు అందిస్తూ.

'ఉష్.... ' అని వారిస్తూ, బ్రదర్ టవలు అందుకుని ప్యాంటు, షర్టు, బనీను, అండర్వేరు – అన్నీ ఒక్కొక్కటీ విప్పి పడేశాడు, అలాగే టీవీ కేసి కన్నార్పకుండా చూస్తూ.

బ్రదర్‌ని చూస్తే ఇంత పిచ్చాడు లోకంలో ఎలా బతుకుతాడా అని జాలేసింది. బట్టలు అందుకుని, రెండు బ్యాగ్‌లూ లోపల బావగారి గదిలో భద్రపరుస్తుంటే నా ప్యాంటులోంచి రెండు పర్సులు పడ్డాయి.

'ఇదేవిట్రా – మన పర్సు పిల్లల్ని పెట్టిందేవిటి' అని ఆశ్చర్యపోతుంటే, అది బ్రదర్ పర్సు అయివుండొచ్చు అనిపించింది.

బ్రదర్ స్నానం చేసొచ్చాక ఇవ్వచ్చులే అనుకుని పర్సు బ్యాగ్‌లో పెట్టి హాల్లోకి వస్తుండగా కరెంటు పోయింది.

'బ్రదర్' – కరెంటు పోగానే తెలివొచ్చి తన కేసి కంగారుగా చూసుకుని కెవ్వుమన్నాడు బ్రదర్ – 'నా ప్యాంటూ, షర్టూ ఏవీ?'

'నువ్వు స్నానం చేసిరా తమ్ముడూ – భోంచేద్దువుగాని – బావగారెప్పుడొస్తారో' కొవ్వొత్తి తీసుకుని వస్తూ అంది సిస్టర్ బ్రదర్‌తో.

'త్వరగా రా – భోంచేద్దాం' అన్నాను.

'నువ్విప్పుడే కదా భోంచేశావు' అన్నాడు బ్రదర్.

'చేశానా? మర్చిపోయాను – మీ మతిమరుపు జబ్బు నాకు కూడా అంటుకున్నట్టుంది – అన్నట్టు బ్రదర్‌కి వాసాల సెంటిమెంటు – భోంచెయ్యడు' అన్నాను సిస్టర్‌తో.

'వాసాల సెంటిమెంటేవిటి?'

'వైష్ణవదేవి వ్రతంలా అదో వ్రతం అనుకుంటా....'

'పోనీ పూరీలు చేస్తా....'

'పూరీలు చెయ్యి - బంగాళాదుంపల కూర కూడా చెయ్యి - బ్రదర్ తిన్నా తినకపోయినా నేను తింటా' అన్నాను హుషారుగా. పూరీ - బంగాళాదుంపల కూర సిస్టర్ స్పెషాలిటీ.

ఇంతలో గేటు దగ్గర స్కూటరాగిన చప్పుడయింది.

'మీ బావగారొచ్చినట్టున్నారు' అంటూ సిస్టర్ గేటు తలుపులు తియ్యడానికి వెళుతుంటే, గాలి విసురుకి కొవ్వొత్తి ఆరిపోయి అంధకారమైంది.

'ఎవరొచ్చారు? మాటలు వినిపిస్తున్నాయి' అనడిగారు బావగారు లోపలకు వస్తూ.

'మా పిన్నిగారబ్బాయి - సత్యం'.

'ఆ మెంటల్ కేసా?' అన్నారు బావగారు చిరాగ్గా.

'మీ మేనత్తగారబ్బాయి - రాజమండ్రిట - అతనుకూడా వచ్చాడు సత్యంతో'.

బ్రదర్ నాతో రాలేదు. విడిగా వచ్చాడు. కానీ, సిస్టర్ అలవాటుగా అన్నీ కలగాపులగం చేసి చెప్పేస్తోంది.

'మా మేనత్తగారబ్బాయేమిటి? రాజమండ్రి ఏవిటి? నాకసలు మేనత్తలే లేరు'.

'వేలు విడిచిన మేనత్తేమో....'

'వేలు విడిచిన మేనత్తలూ లేరు, వేలువిడవని మేనత్తలూ లేరు. ఈ మెంటల్ గాడు ఎవణ్ణి పట్టుకొచ్చాడో...'

బ్రదర్‌ని చూస్తే మిస్టరీ మంచులా విడిపోతుందని బాత్రూం దగ్గరికి తడుముకుంటూ వెళ్ళి, 'బ్రదర్ - రేపు తీరిగ్గా జలకాలాడుదువుగాని తొందరగా బయటపడు. బావగారొచ్చారు' అన్నాను. సమాధానం లేదు. బాత్రూం తలుపు తోశాను. లోపల ఎవరూ లేరు.

'తమ్ముడేడీ?' అంది సిస్టర్ నేను హాల్లోకి రాగానే.

'కనిపించడం లేదు - ఎక్కడికెళ్ళాడబ్బా?' అని తలగోక్కున్నాను.

'ఏవిటి? నాతల గోకుతున్నావు' - ఉరిమారు బావగారు.

'మీ తలా? నా తల ఏమైపోయింది?' అని కంగారు పడుతుండగా కరెంటు వచ్చింది.

'వీడు మెంటల్ కేసే' అంటూ బావగారు తలపట్టుకుని లోపలికి వెళ్ళిపోయారు. భోజనాలయ్యాక, 'నాకు ఆరుబయట పక్క వెయ్యి' అన్నాను సిస్టర్‌తో.

పెరట్లో, చల్లగాలిలో పచార్లు చేస్తూ, 'నేనొక పూల మొక్క కడ నిల్చి....' అని అందుకున్నాను. చుట్టుపక్కల ఇళ్ళల్లో లైట్లు వెలిగి కిటికీ తలుపులు తెరుచుకున్నాయి. మన ముఖారవిందం వాళ్ళకి కనిపించకుండానే వెంటనే కరెంటు పోయింది. మళ్ళీ ధన్ ధన్ మని తలుపులు మూసుకున్నాయి. 'పుష్ప విలాపం', 'ఆంధ్రపౌరుషం' లాగించి, కొంచెం వార్మ్ అప్ అయ్యాకా జాషువా గారి శ్మశాన వాటిక అందుకున్నాను - 'ఇది పిశాచులతో నిటలేక్షణుండు - గజ్జె కదలించియాడు రంగస్థలంబో....ఓ...ఓ.....ఓ....'

బావగారు కిటికీ తలుపు విసురుగా తీసి గట్టిగా అరిచారు - 'నాలుగు లక్షలు పెట్టి కట్టుకున్న కొంప - పిశాచాలు తిరుగాడే శ్మశానం కాదు- ఇంక నోర్మూసుకు పడుకో....'

బావగారికి కళాత్మక హృదయం లేదు - ఏం చెయ్యను? - అందుకని నోరు మూసుకున్నాను కానీ పడుకోలేదు. అటూ ఇటూ పచార్లు చెయ్యసాగాను. అలా పచార్లు చేస్తుంటే, 'శ్రీ ఆంజనేయం..... ప్రసన్నాంజనేయం....' అనుకుంటూ బొండాచారిగారు రోడ్డుమీద కనుపించారు. నక్షత్రాల వెలుగులో ఆకారాన్నిబట్టి ఆయన్ని గుర్తుపట్టి, 'ఆచారిగారూ' అని పిలిచాను.

ఆయన ఉలిక్కిపడి ఎగిరి గంతేసి, రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ, 'నన్నొదిలేసేయ్ - కావాలంటే మా ఆవిణ్ణి తినేసేయ్' అని, నాకు తెలుగు అర్థం కాదు అన్నట్లు మళ్ళీ ఇంగ్లీషులో 'నన్ను .... లీవ్.... ఈట్ మై పెళ్ళాం....' అన్నారు గజగజ వణుకుతూ.

'మిమ్మల్ని తినడవేవిటి - నేను, సత్యాన్ని'.

'నువ్వా - హడలగొట్టి చంపావు కదరా నాయనా - శ్రీ ఆంజనేయం....'

'నేను మీ కళ్ళకి మనుషుల రక్తం తాగే డ్రాక్యులాలా కనిపిస్తున్నానా?' అన్నాను ఆశ్చర్యపోతూ.

'రజ్జు సర్ప భ్రాంతి నాయనా - లేకపోతే బఫూన్‌ని చూసి నేను భయపడడవేవిటి - వీళ్ళ మొహాలు మండా - ఇంగ్లీషు వాళ్ళు ఏం గొప్పగా తీస్తార్రా హార్రర్ సినిమాలు - శ్రీ అంజనేయం - వెధవది చూడకుండా ఉండలేను - చూస్తే చచ్చే భయం - నేను మా ఇంటికి చేరేదాకా నువ్విక్కడే ఉండరా నాయనా' అని నన్ను బతిమాలి, 'శ్రీ ఆంజనేయం... ప్రసన్నాంజనేయం....' అనుకుంటూ, నేను అక్కడ ఉన్నానా లేనా అని అప్పుడప్పుడు వెనక్కు తిరిగి చూస్తూ వాళ్ళ ఇంటికి వెళ్ళిపోయారు ఆచారిగారు.

ఆయన వెళ్ళిపోయాక ఇంగ్లీషు దయ్యాలు ఆంజనేయస్వామి వారి జూరిస్ డిక్షన్లోకి వస్తాయా రావా అని చిన్న ధర్మ సందేహం వచ్చింది. ఆ సందేహం రాగానే సింగినాదం గుర్తుకొచ్చాడు (వాడి అసలు పేరు సి. గుర్నాథం - వాణ్ణి మేమంతా అభిమానంగా ప్రొ. సింగినాదం అని పిల్చుకుంటాం). వాడు క్షుద్రశక్తులు, అతీంద్రియ శక్తులు లాంటి వాటి మీద విస్తృత పరిశోధనలు చేస్తున్నాడు. 'అమెరికన్ దయ్యాలు - ఆంజనేయస్వామి' కేసు వాడిని కలిసినప్పుడు వివరంగా చర్చించాలి అనుకుంటూ మంచం మీద వాలాను. మంచం మీద పడుకుని అలా ఆకాశంలోకి చూస్తూ ఉంటే అక్కడ ఏ గ్రహంలోనైనా నాలాంటి జీవులున్నారా అనే సందేహం కలిగింది. నా లాగానే అవతలి గ్రహం వాడు కూడా, వాడి గ్రహంలో వాడి మంచం మీద బబ్బుని, ఇదే సమయంలో నేను అనుకుంటున్నట్లుగానే అనుకుంటున్నాడేమో -మనం వాడికి ఓ టెలిపతీ సందేశం పంపిస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచనొచ్చింది.

సింగినాదం చెప్పినట్లు, కళ్ళు మూసుకుని, మనసు కనుబొమ్మల మధ్య కేంద్రీకరించి, 'హలో బ్రదర్... హలో.... హలో.... హలో బ్రదర్' అని నిశ్శబ్దంగా మనసులో అనుకుంటూ ప్రసారం చెయ్యసాగాను.

కొంచెం సేపటికి, 'బ్రదర్ .... బ్రదర్' అని మెల్లిగా వినిపించింది.

'అరే! అవతలి గ్రహం వాడు మనతో మాట్లాడేస్తున్నాడు' అనుకుని, 'హలో.... హలో బ్రదర్... ఏ గ్రహం నుంచి?' అనడిగాను.

'ఇక్కడనుంచే బ్రదర్' అని సమాధానం వచ్చింది.

నేను ఉలిక్కిపడి లేచి కూర్చుని అటూ ఇటూ చూశాను. వాడితో టెలిపతీ ద్వారా మాట్లాడదామనుకుంటే, వాడు నా కంటే నాలుగాకులు ఎక్కువే చదివినట్టున్నాడు, డైరెక్టుగా కొంపలోకి దిగిపోయాడు. వాడు అంగుళం సైజులో ఉన్నాడో? అదృశ్య రూపంలో ఉన్నాడో? పిల్లీ, కుక్కా, కిటికీ - ఏ రూపంలో ఉన్నాడో అని మంచం మీంచి దూకి తలగడకిందా, మంచం కిందా వెతుకుతుంటే, పిట్టగోడమీంచి 'ఇక్కడ బ్రదర్' అని వినిపించింది. నేను తలెత్తి చూస్తే గోడ మీద బ్రదర్ ఆకారం కనుపించింది. గ్రహాంతర జీవులు తెలుగు మాట్లాడేస్తాయి. మన రూపాలు కూడా ధరించేస్తాయన్న మాట. ఇది బ్రదర్ వేషంలో వచ్చేసింది.

'ఏవిటి - ప్రయాణం బాగా జరిగిందా? బ్రదర్ రూపంలో వచ్చావన్నమాట'

'బ్రదర్ రూపంలో రావడమేవిటి - నేను బ్రదర్నే బ్రదర్' అంది పిట్టగోడ దగ్గరున్న ఆకారం, టవలు దగ్గరకు లాక్కుని ఎగిరి గోడమీద కూర్చుంటూ.

అది గ్రహాంతరజీవి కాదు. అచ్చంగా మన బ్రదరేనన్నమాట. గ్రహాంతరజీవి రానందుకు కొంచెం బాధ కలిగినా, బ్రదర్ కనిపించినందుకు చాలా సంతోషం కలిగింది – 'బ్రదర్, ఇందాకా ఏవైపోయావు? బట్టలేసుకోకుండా ఇంకా టవలుతోనే తిరుగుతున్నావే?'

'నువ్వు నా బేగ్ లోపల పెట్టేశావు కదా' అన్నాడు బ్రదర్ దుఃఖంతో.

'మరి నన్నడగొచ్చు కదా బ్రదర్'.

'అంత టైమ్ లేదు బ్రదర్ – నీ మీద ఎవరికీ అనుమానం రాలేదు కదా'.

'బావగారికి నేను పజ్జాలు పాడినందుకు కోపం వచ్చింది కానీ అనుమానం దేనికి?'

'సిస్టర్ చాలా అమాయకురాలు – చాలా మంచిది – నేను బావగారి వైపు నుంచి కాక నీలా సిస్టర్ తరఫున బంధుత్వం కలుపుకున్నా బావుండేది' అన్నాడు బ్రదర్ నిట్టూరుస్తూ.

'స్నానానికి బయలుదేరిన వాడివి ఏవైపోయావు?'

'అదంతా తర్వాత చెపుతా కానీ, ముందు చచ్చే ఆకలిగా ఉంది – తినడానికేమైనా దొరుకుతుందా?'

'అప్పుడు నాతో భోంచేసేయి బ్రదర్ అంటే సెంటిమెంటన్నావు – ఇప్పుడేమో ఆకలంటున్నావు'.

'ఆకలికి సెంటిమెంటు లేదు బ్రదర్, ఏదో ఒకటి తినకపోతే ప్రాణం పోయేలా ఉంది'.

'సిస్టర్‌ని లేపుతాను'.

'బావగారిని మాత్రం లేపకు'.

'ఆయన్ని లేపడమా – ఇప్పుడు లేపితే చంపేస్తారు – నువ్విక్కడే ఉండు'.

'నా కోసం అని చెప్పకు – నీ కోసం అని చెప్పు'.

'ఓకే బ్రదర్' అంటూ వెళ్ళి తలుపు తట్టాను. సిస్టర్ తలుపు తీసింది.

'సాయంకాలం చేసిన పూరీలు ఉన్నాయా – ఉంటే ఓ అరడజను కూరతో సహా...'

'నీ తిండి మండిపోనూ – చిన్నప్పట్నుంచీ ఏం మారలేదురా – ఇందాకే పూరీలు తిన్నావు కదా'.

'తిన్నాననుకో - జఠరాగ్ని ప్రకోపించినట్లుంది - చచ్చే ఆకలిగా ఉంది'

'తిన్నదంతా అరిగిపోయేలా పజ్జాలు పాడితే ఆకలెయ్యదూ - వాడికి పూరీలిచ్చి నాకు అమృతాంజనం తగలెయ్యి' - లోపలినుంచి బావగారి గొంతు కర్కశంగా వినిపించింది.

'దూర్వాసుడు నిద్రపోలేదా'.

'ఇప్పుడే నిద్రపోతుంటే మళ్ళా లేపేశావు' అని విసుక్కుంటూ పూరీలు పొట్లం కట్టి, స్టీలు ప్లేటు నిండా కూర వేసి అందించింది.

'ఇక తలుపేసుకో' అని సిస్టర్‌కి చెప్పి, పిట్టగోడ దగ్గరికివెళ్ళి, 'బ్రదర్.... బ్రదర్' అని పిలిచాను.

'ఇక్కడ' అన్నాడు బ్రదర్ మళ్ళీ గోడెక్కి కూర్చుంటూ - 'బావగారికి ఏం కోపం బ్రదర్ - ఆయన అరుపు వినిపించగానే హడలిపోయి గోడమీంచి దూకేశా- పనిలో పని - నా బేగ్ తెచ్చెయ్యకపోయావా?' అన్నాడు పూరీలు అందుకుంటూ.

'ముందు చెప్పకపోయావా - ఇప్పుడు మళ్ళీ లేపితే బావగారు నన్ను మర్డరు చేస్తారు'.

'ఈ టవలుతో రాత్రంతా గడపనా - నీ కసలు బుర్ర లేదు బ్రదర్' అన్నాడు బ్రదర్ చిరాగ్గా - 'అసలు అయిదేళ్ళ నుంచీ మన జాతకం బాగోలేదు - చంటాడి మూలాన రాజమండ్రిలో మూడేళ్ళుండి ఇప్పుడే బయటపడ్డాను...'

'చంటాడెవడు బ్రదర్?'

'బిజినెస్ పార్ట్నర్ - స్టీలు బీరువాకి, స్టీరియోకి తేడా తెలీని బుర్ర తక్కువ సన్నాసిని పార్ట్నర్‌గా వేసుకోవడం నా తప్పే బ్రదర్'.

'ఏం బ్రదర్?'

'స్టీలు బీరువా అనుకుని చంటాడు స్టీరియో తిప్పితే ఏవయింది? పేట పేటంతా సంగీతం గోలతో లేచిపోయింది. మూడేళ్ళు మావగారింట్లో గడపాల్సొచ్చింది'.

'స్టీరియో సంగీతానికి, మావగారింటికి లింకేవిటి బ్రదర్?'

'నా తలకాయ బ్రదర్' అన్నాడు బ్రదర్ చిరాగ్గా.

బ్రదర్ ఎందుకో చిరాగ్గా, బాధగా ఉన్నాడని అర్థమైంది - 'నీ బాధ నేను అర్థం చేసుకోగలను బ్రదర్' అన్నాను సానుభూతిగా.

'నువ్వు అర్థం చేసుకోలేవు - ఇంతవరకూ పబ్లిక్ ప్రాపర్టీని ప్రైవేటీకరణ చెయ్యడమే కాని అండర్వేరుతో సహా అన్నీ పోగొట్టుకున్న దుస్థితి ఎప్పుడూ రాలేదు

– నాకు సైకలాజికల్‌గా తగిలిన దెబ్బ నీకు అర్థం కాదు బ్రదర్ – అసలు ఇదంతా నీ మూలంగానే జరిగింది' అని నన్ను నిందించి, 'కొంచెం మంచినీళ్ళియ్యి' అన్నాడు, పూరీలు తిని కాగితం పడేస్తూ.

గ్లాసుతో మంచి నీళ్ళిచ్చాను. బ్రదర్ నీళ్ళుతాగి, 'ఇప్పుడేం చెయ్యనూ' అన్నాడు.

'ఆ గ్లాసు ఇచ్చేయ్'

'అరె – గ్లాసు నా దగ్గరే ఉందా' అన్నాడు బ్రదర్, టవలు మడతల్లోంచి గ్లాసు తీసి ఇస్తూ.

రాత్రి పన్నెండు గంటలకి మేమిద్దరం అలా మాట్లాడుకుంటుంటే సీనులోకి టైగర్ ప్రవేశించింది. టైగర్ అంటే పేటకి ఎవరూ నియమించని, సెల్ఫ్ ఎప్పాయింటెడ్ సెక్యూరిటీ ఆఫీసరన్న మాట. రాత్రివేళ దేశసంచారం చేస్తూ, తన రాజ్యంలో శాంతిభద్రలు చూసుకుంటూ మెల్లిగా పరిగెడుతూ అటు వచ్చింది టైగర్. నన్ను చూసి గుర్తుపట్టి, తోక ఊపి 'హలో... హలో....' అని పలకరించింది. నేను చెయ్యి ఊపి, 'హలో.... హలో...' అని జవాబు చెప్పబోయేంతలో దాని దృష్టి గోడ మీద కూర్చున్న నల్లటి ఆకారం మీద పడింది. దానికి అనుమానం వచ్చి పరిశోధించడానికి కొంచెం దగ్గరకు వచ్చింది.

టైగర్‌ని చూడగానే బ్రదర్ అనవసరంగా కంగారు పడ్డాడు. గోడకి ఇటువైపు దూకితే నేను అభయహస్తం ఇచ్చి ఆదుకునే వాడిని. బ్రదర్ కంగారుపడి రోడ్డు వైపుకి దూకి, రెండు చేతులతోనూ టవలు జారిపోకుండా పట్టుకుని కార్టూన్ ఫిల్ములో కేరెక్టరులా పరుగు లంకించుకున్నాడు. ఇంక నాకు టైగర్‌కి, 'ఇతను మన బ్రదర్ టైగర్!' అని చెప్పే అవకాశం లేకుండా పోయింది.

బ్రదర్ రోడ్డు మీదకు దూకగానే మొదట రెండడుగులు వెనక్కి వేసిన టైగర్, బ్రదర్ పరుగెడుతుంటే ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది. అంతలో కర్తవ్యం గుర్తుకొచ్చి, 'భౌ... భౌ....' అని అరుస్తూ వెంటపడింది.

టైగర్ శక్తి సామర్థ్యాలమీద పేటలో అందరికీ విపరీతమైన నమ్మకం. అది కూడా, 'నేనుండగా మీకు భయమేల' అని ఎవరో స్వామీజీ అభయ హస్తం ఇచ్చినట్లు, పేటవాసులకి అభయహస్తం – టైగర్‌కి హస్తం లేదు కదా – అభయతోక ఇచ్చి తిరుగుతూ ఉంటుంది. ఒక మాదిరి కేసులన్నీ ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండా తనే పరిష్కరిస్తుంది. అలాంటిది అది అరిచిందంటే అత్యవసర పరిస్థితి ప్రకటించినట్లే.

వెంటనే అన్ని ఇళ్ళల్లోనూ లైట్లు వెలిగాయి. తలుపులు తెరుచుకున్నాయి. చేతి కర్రలతో క్షణంలో ఓ వందమంది తయారయ్యి దాని అరుపులు వినిపిస్తున్న దిక్కుకి

బేటరీ లైట్లు వేసుకుని పరుగెట్టారు. పది, పదిహేను నిమిషాల తర్వాత మెల్లిగా ఒక్కొక్కరే తిరిగి వచ్చారు. టైగర్ కానీ, బ్రదర్ కానీ వాళ్ళకు కనిపించలేదు.

టైగర్ ఏమైపోయింది అని అందరూ ఆశ్చర్యపోతుంటే మరో అయిదు నిమిషాల తర్వాత ఒక్కత్తీ తిరిగి వచ్చింది. టైగర్ కనిపించగానే గుంపు చప్పట్లు కొట్టి అభినందిస్తూ దారి ఇచ్చింది. అభినందనలు అందుకుంటూ, సైనిక వందనం స్వీకరిస్తున్నట్లు తోక ఎత్తి ఆడిస్తూ గుంపు మధ్య మందగమనంతో పరుగెడుతూ నా ఎదురుగా వచ్చి నిలబడింది టైగర్. దాని నోట్లో విజయకేతనంలా ఎగురుతోంది బ్రదర్ టవలు.

ఆ తర్వాత బ్రదర్ ఏవయ్యాడో ఎవరికీ కనిపించలేదు. యోగి వేమనలా ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో, ఏం కష్టాలు పడుతున్నాడో - బ్రదర్‌ని తలుచుకుంటే నా గుండె కరిగి నీరవుతోంది.

*(ఇండియా టుడే, నవంబర్ 21- 5 డిసెంబర్, డిసెంబర్ 6-20, 1995)*